# పిట్టపోరు, పిట్టపోరు... తీర్చినదెవరు?

యూనివర్శిటీ వాతావరణమంతా చాలా హడావుడిగా వుంది. నేల ఈనినట్లుగా వున్నారు జనం. ఎక్కడ చూసినా విద్యార్థులే! ఒకరి నొకరు తోసుకుంటున్నారు, ఆరాటపడిపోతున్నారు. ఏ సినిమా తారను చూడటానికీ అంతగా విరగబడరేమో! అంత మంది జనం యూనివర్శిటీ ఆవరణలో ఉన్నారంటేనే ఆశ్చర్యంగా వుంది. కానీ, ఉన్నారు. అందరూ విద్యార్థులే. అందరిముఖాలలోనూ ఆందోళన. ఆరోజు విద్యార్థుల జీవితాలలో అతిముఖ్యమయిన రోజు. యెంట్రెన్స్ పరీక్ష ఫలితాలు ప్రకటించిన బోర్డు పెట్టారు యూనివర్శిటీ ఆవరణలో. విద్యా విధానాలే విచిత్రంగా మారిపోతున్నాయి రోజు రోజుకీ- ఆ మధ్య తెలంగాణా ఏజిటేషన్ వచ్చింది. విశ్వవిద్యాలయ వాతావరణమే పాడయిపోయింది. బహిరంగంగా పుస్తకాలు చూసి కాపీలు కొట్టారు అందరూ. ఉస్మానియా విశ్వవిద్యాలయపు డిగ్రీలకు విలువలేకుండా పోయింది. అందరికీ డిగ్రీలు సునాయాసంగా వచ్చాయి కానీ, ఉద్యోగావకాశాలు మాత్రం కరువయ్యాయి. ఎవరు తెలివైనవాళ్ళో, ఎవరు చవటలో, తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. తెలివయిన వాళ్ళలో కూడా చాలామంది చదవటం మానేసారు, "వేస్ట్" అని. అంతలో అత్యవసర పరిస్థితి ప్రకటించబడింది. ఒక్కసారిగా విశ్వవిద్యాలయంలోకి ఎక్కడలేని క్రమశిక్షణా వచ్చి పడింది. కాపీలు కొట్టి కొట్టి కాలేజీల వరకూ వచ్చిన ప్రబుద్ధులు అక్కడ చతికిలబడ్డారు. పరీక్షలకు కూచున్నవారిలో నాలుగోవంతు మంది కూడా పాస్ కాలేకపోయారు. కాలేజీలో సీట్లు ఖాళీగా వుండిపోయాయి.

విద్యార్థులు కొంత కొంత దారిలో పడ్డారు. పుస్తకాలు చదివి పరీక్షలు వ్రాయటం అలవాటు చేసుకున్నారు. పరిస్థితి కొంత మెరుగు పడింది.

ఇంతలో మళ్లీ కొన్ని కొన్ని కాలేజీలు బయలుదేరాయి. అవి దొనేషన్లు తీసుకుని

## ఆనందారామం

ఎలాంటివాళ్ళనైనా చేర్చుకోసాగాయి. ఆ తరువాత అలాంటి కాలేజిల్లో కాపీలను యాజమాన్యమే ప్రోత్సహించేది, ఫలితాల కోసం. ఇంకేం, ఎందుకూ పనికిరాని చవటలకి సహితం, ఫస్ట్‌క్లాసులు వచ్చేసేవి!

అంచేత మళ్లీ ఒక కొత్త సమస్య తలెత్తింది. ఈ ఫస్ట్‌క్లాసుల్లో నిజంగా, ఫస్ట్ లెవరు? భ్రష్టు లెవరు! అని-పోస్ట్ గ్రేజ్యుయేషన్‌లో ప్రవేశానికి ప్రవేశ పరీక్షలు పెట్టారు. కష్టపడి పరీక్షలు వ్రాసి పాసైన వాళ్ళంతా మళ్లీ పరీక్ష వ్రాయవలసిందే! ఈ ప్రవేశ పరీక్షలు సాధారణంగా ఆబ్జెక్టివ్ టైప్‌లో వుంటాయి. త్వర త్వరగా సమాధానాలు గుర్తించలేని విద్యార్థి పని "గోవిందా!" యూనివర్శిటీలోని ప్రతి విభాగంలోనూ ముప్పైసీట్లకు మూడువేల అప్లికేషన్లు! (ఇంకా ఎక్కువే నేమో!) అలా వున్నాయి ఫలితాలు మరి! అంచేత తమకు సీట్ వచ్చిందో, లేదో, చూసుకోవటానికి, విద్యార్థులు ఒకరి నొకరు తోసుకుంటూ ఆరాటపడటంలో ఆశ్చర్యమేముంది?

ఆ త్రొక్కిసలాటలో తన భుజంమీద పడిన చెయ్యిని తోసేస్తూ వెనక్కి తిరిగిన హరి, విమల్‌ని చూస్తూ నవ్వి

"హాయ్, విమల్?" అన్నాడు.

"హాయ్? నంబర్స్ బోర్డులో పెట్టేశారా?"

"ఇంకా లేదు! రేపు పెడతారుట?"

"ఇవాళ అన్నారుగా!"

"అన్నది అన్నట్లుగా ఎక్కడ జరుగుతుందోయ్?"

"అయితే. మళ్లీ రేపు రావాలన్నమాట!"

"అవును! రావలసిందే! ఈ అప్లికేషన్స్ మూలంగా మన యూర్శిటీకి కొన్ని లక్షల ఆదాయం వచ్చిందట!"

"చూడు! ఎలా వున్నారో జనం!"

"ఎలా రాసావు, యెంట్రన్స్?"

"మొదట కొంచెం ఆలోచించుకుని బాగానే గుర్తించాను, సమాధానాలు. ఇంతలో టైం అయిపోయిందన్నారు. ఏదో గబ గబ గుర్తించాను. భయంగానేవుంది. నువ్వెలా రాసావు?"

"నేను బాగానే రాసానులే! అయినా నాకు సీట్ వస్తుంది!"

"ఏమిటోయ్! ఆ ధీమా!"

"నేను యస్.సి (S.C) నోయ్!" గర్వంగా అన్నాడు విమల్. ఈర్ష్యగా చూసాడు హరి.

"ఇది అన్యాయం! కష్టపడి చదువుకుని మార్కులు తెచ్చుకున్న వాళ్ళని వదిలేసి కులం పేరుతో మార్కులు రానివాళ్ళకి సీట్ ఇవ్వటం..."


విమల్‌లోనూ రోషం తలెత్తింది.

"ఏమన్యాయమోయ్! ఇన్నాళ్ళుగా మీ పై కులాలవాళ్ళు మమ్మల్ని అన్నివిధాలా అణగద్రొక్కి వుంచలేదూ? ఎంత ప్రోత్సాహముంటే పైకి రాగలం మేము?"

"చిన్నప్పటి కథలో తోడేలు మేకపిల్లతో 'ఆర్నెల్ల క్రిందట మీ అమ్మ నన్ను తిట్టింది కనుక నిన్ను మింగుతాను' అన్నట్లుగా వుంది."

"ఎవరోయ్ తోడేళ్ళు? మీరే! మీ పై కులాలవాళ్ళే! ఈనాటికీ ఏదో వంకన మా లాంటి మేకపిల్లల్ని మింగుతూనే వున్నారు!"

"మేము తోడేళ్ళమా! వెధవ కులం! మా నాన్న ఒకప్పుడు పురోహితుడే! ఇప్పుడు తద్దినాలకి తప్ప మరెందుకూ పిలవటంలేదు మా నాన్నని! జనంలో దెయ్యాలపట్ల భయం తప్ప మరేమీ మిగలలేదు. నలుగురం అన్నదమ్ములం! ఛస్తున్నాం బ్రతకలేక. ఉద్యోగం




చేసుకుందామన్నా, మామూలు బేచ్యులర్ డిగ్రీలకి యెవరూ వుద్యోగాలివ్వరు యెంతో రికమెండేషన్ వుంటేతప్ప... భూములన్నీ అమ్ముకుని చదువుకుంటుంటే, ఇలా వుంది పరిస్థితి....''

"మీకు అమ్ముకోటానికి భూములన్నా వున్నాయిగా! మాకు అవీలేవు. అయినా నీకు చదువెందుకు! నువ్వూ మంత్రాలు నేర్చుకోరాదూ!''

"మీకు భూములు లేకపోతేనేం! చెప్పుల దుకాణం వుందిగా! అయినా, నువ్వు మాత్రం చదువుకోవటం దేనికి! చెప్పులు కుట్టుకోరాదూ!''

"ఏమిట్రా కూసావ్! నన్నంత మాట అంటావా!''

"ఏం! నువ్వు మాత్రం నన్ను అంతంత మాటలు అనలేదూ!''

"మంత్రాలు చదువుకోమంటే తప్పా!''

"చెప్పులు కుట్టుకోమంటే తప్పా!''

"భూమ్మీద సుఖపడితే తప్పు లేదురోయ్!''

ఇద్దరి వాదాలనూ మింగేస్తూ పక్కగా పోతున్న కారులోంచి విద్యాధర్ గొంతు వినిపించింది. కారు ఆపాడు విద్యాధర్. విమల్, హరి, ఇద్దరూ తమ వాదనలు మరిచి పోయి విద్యాధర్‌ని ఆశ్చర్యంగా చూసారు.

"నువ్వూ యెంట్రెన్స్ టెస్టు రాసావా!'' ఇద్దరూ ఒకేసారిగా అడిగేసారు. విద్యాధర్ అప్పటికి నాలుగేళ్లుగా బి.ఏ చదువుతున్నాడు. ఒక గ్రూపునుండి ఇంకో గ్రూపుకు మారుతూ ఏ గ్రూపులోనూ పాసు కాలేక సతమత మవుతూ సరదాగా కాలేజి వచ్చేవాడు కారులో. స్నేహితులందరినీ యెప్పుడంటే అప్పుడు కారులో తన ఇంటికి తీసికెళ్ళేవాడు. చక్కని రెండంతస్థుల మేడ అతని ఇల్లు-ఆ ఇంట్లో యెప్పుడూ అరటిపళ్ళకూ కొబ్బరి చిప్పలకూ కొదవ వుండేదికాదు. ఒక నౌకరు అవన్నీ మారు బేరానికి అమ్ముతూ వుంటాడు. కాంపౌండ్ బయట చిన్న షెడ్‌లో —

"స్వామివారి ప్రసాదం" అని అరుస్తూ- "ఇన్నిన్ని అరటిపళ్ళు యెక్కడివి!" అని అడిగిన మిత్ర బృందాన్ని.

"ఇంత అమాయకులేమిటి!" అన్నట్లు జాలిగా చూస్తూ

"మా అమ్మ బాబాగారి శిష్యురాలు. మా నాన్నగారు పోయినప్పటినుంచీ, పూర్తిగా వేదాంత ధోరణిలో పడిపోయింది. ఆయనకు భక్తులు సమర్పించు కొన్ని నైవేద్యాలు ఇవన్నీ....''

"బాబాగారెవరు!''

"మీకు తెలియదూ! దేవుడు!''

"దేవుడా! దేవుడు భూమిమీద కొచ్చాడా! ఈ అరటిపళ్ళు తినటానికి!''

విద్యాధర్ పక పక నవ్వి "ఛా! దేవుడు ఈ చీప్ క్వాలిటీ అరటిపళ్ళు తినడురా! అందుకే అమ్మేస్తున్నాం! గాడ్ ఈజ్ గ్రేట్ కదా! ఆయన ఆహారం కూడా చాలా 'గ్రేట్' గానే వుంటుంది. పూటకి పాతిక రూపాయలు ఖర్చవుతుందిట, ఆయన భోజనానికి!''

"హమ్మ బాబోయ్! అంత డబ్బెక్కడి దిరా!''

"సన్నాసుల్లారా! ఆయన దేవుడురా! అందరి డబ్బు ఆయనదే!''

మిత్ర బృందమంతా ఘొల్లున నవ్వేసరికి. వాళ్ళతోపాటు విద్యాధర్ కూడా నవ్వేసేవాడు. కానీ వాళ్లే కొందరు, పరీక్షలముందు బాబా గారి వీబూది అడిగి తీసుకుని మరీ పెట్టుకునే వారు. "ఇదెందుకురా!'' అని మరికొందరు వేళాకోళంచేస్తే "పోనీయ్‌రా! ఏ పుట్టలో ఏ పాముందో! ఈ వీబూది పెట్టుకుంటే నష్ట మేముందీ!'' అనేవారు. మరికొందరు "మన మంతా ఇంతే! పుట్టల్లోంచి బయటికి రాని పాములను ఊహించుకుంటూ పుట్టలు పెంచు కుంటూ పోతాం!'' అని విసుక్కున్నారు.

"అవునోయ్! యెంట్రన్స్ రాసేసాను. మీరు చూడలేదా! అవునులే! ఆ జన ప్రవాహంలో ఒకరి నొకరు కలుసుకోవటానికే లేదు. తీర్థానికొచ్చినట్లునా వున్నారు గాని. పరీక్ష వ్రాయటానికి వచ్చినట్లుగా లేరు!''

"ఇంతకూ నువ్వు 'బి.ఏ' పాసయ్యావన్న మాట!''

"ఆ! 'దేవుడి' దయవల్ల పాసయ్యాను.''

విద్యాధర్ ఆ ఇద్దరినీ తన కారులో యెక్కించుకుని, మేట్నీ చూపించి, ఆ తరువాత హోటల్‌లో తినిపించి ఇళ్ళలో దింపాడు.

విద్యార్థులంతా, ఆశగా ఆరాటంగా యెదురుచూస్తున్న ఆ మరునాడు వచ్చింది. ఒకళ్ళ నొకళ్లు తోసుకుంటూ నంబర్లు వెతుక్కుంటున్నారు. కొందరి ముఖాలు సంబరంతో వెలిగిపోతున్నాయి. మరికొందరి ముఖాలు వడిలిపోయి కనిపిస్తున్నాయి. హరి, విమల్, ఒకరి నొకరు తోసుకుంటూ వెళ్ళి నంబర్లు చూసుకున్నారు. ఇద్దరి నంబర్లూ లేవు. ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు. స్పర్థతో ఢీకొన్న వాళ్ళ మనసులు దుఃఖంలో మళ్ళీ ఒకటయ్యాయి.

"ఏంచేద్దాం!'' అన్నాడు విమల్ నిరాశగా.

"అదే తోచకుండా వుంది. ఏదైనా ఇన్‌స్టిట్యూషన్‌లోచేరి ప్రైవేట్‌గా ఏదైనా పరీక్షలకు కడదామా!''

"హమ్మ బాబోయ్! బోలెడు డబ్బు గుమ్మరించాలి! అయినా అక్కడ మాత్రం కాంపిటీషన్ తక్కువా! పోనీ వుద్యోగాలూ లేవు.''

హారన్ వేస్తూ కారు ఆగింది వాళ్ళ పక్కన-దాన్లో ఉన్నాడు విద్యాధర్. కిటికీ లోంచి తల బయటకుపెట్టి "హలో''! అన్నాడు.



"మాకు సీట్ దొరకలేదు. మీకు?" అన్నాడు హరి.

"నాకు దొరికింది!" హుషారుగా ఈల వేసాడు విద్యాధర్.

"ఆ!" అని నోరు వెళ్ళబెట్టిన మిత్రులిద్దరూ కొంతసేపటికి కానీ కోలుకోలేక పోయారు.

"అంత బాగా రాసావా?" నిగ్రహించుకోలేక అడిగేసాడు హరి.

"నాకొచ్చిన సీట్ నేను రాసినదానికి కాదోయ్! నేను సబ్‌మిట్ చేసిన 'బి.సి'(B.C) సర్టిఫికేట్‌కి!"

"వాట్!" తల తిరిగినట్లయింది హరికి.

"నువ్వు బేక్‌వర్డ్ క్లాసా?"

"నోటికొచ్చినట్లు వాగావంటే తంతాను. యెన్ని గుండెలురా, నన్ను బేక్‌వర్డ్ క్లాస్ అనటానికి? నేనంత హీనంగా కనిపిస్తున్నానా? సర్టిఫికేట్ సబ్‌మిట్ చేసాను! సీట్ వచ్చింది. అంతే."

తనకు జరిగిన అవమానం భరింలేనన్నట్లు కారు రయ్‌మని పోనిచ్చాడు విద్యాధర్.

"వీడికి బి.సీ సర్టిఫికేట్ యెలా దొరికిందిరా?" దిగాలు పడిపోతూ అడిగాడు, షెడ్యూల్‌కాస్ట్ విమల్.

"దేవుడు" తలచుకుంటే అసాధ్యమేముంది!"

వేదాంతిలా నవ్వాడు, పురోహితుడి కొడుకు హరి.

ఇద్దరూ చెట్టాపట్టా లేసుకుని జీవన పోరాటంలో ప్రవేశించటానికి ముందడుగు వేసారు.

*